
ఈ వారం తెలుగు పుస్తకం

# ఎప్పుడయినా చదవ దగిన 'అప్పుడు -ఇప్పుడు'

సౌభాగ్య




**Title :** Appudu-Ippudu
**Author:** G. Krishna
**Subject:** ESSAYS-ANTHOLOGY
**Year of Publication:** 2001
**Price:** USD $ 1.62

ప్రతిభావంతుల అనుభవాలు, వాటి పట్ల వాళ్ళ ప్రతిస్పందనలు ఆకర్షణీయంగా వుంటాయి. మానవత్వం తొణికిసలాడే వాళ్ళ మాటలు సత్యనిష్ఠతో కూడుకుని వుంటాయి.

జి.కృష్ణగారు పాత్రికేయులు. 'అప్పుడు-ఇప్పుడు' శీర్షికన 1982 నుంచి 'ఆంధ్రప్రభ'లో ఆయన కాలమ్ నిర్వహించారు.వాటిల్లో కొన్నిట్ని 'అప్పుడు-ఇప్పుడు'అన్న పేరుతో రచన జర్నలిజం కళాశాల వారు పుస్తకంగా తెచ్చారు.

ఈ వ్యాసాలు గడచిన అరవైడెబ్భయి సంవత్సరాల ఆంధ్రదేశాన్ని, భారతదేశాన్ని, అపురూపమయిన వ్యక్తుల్ని, కళల్ని,జీవన తరంగాల్ని మనకు పరిచయం చేస్తాయి. జర్నలిస్టుగా ఆయనకు 'ఎన్నెన్నో పరిచయాలు, మరెన్నో అనుభవాలు. అనంత జీవనయాత్రలో అందుకున్న ఆణిముత్యాలెన్నో".

జి.కృష్ణగారు 1924 అక్టోబరు 20 న కృష్ణాజిల్లా మధురాపురంలో జన్మించారు. 1946 లో ఇంగ్లీషు మీజాన్‌లో విలేఖరిగా పత్రికారచనకు శ్రీకారం చుట్టారు.

ఫ్రీప్రెస్ జర్నల్, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో వివిధ హోదాలలో పనిచేశారు. గణపతి ముని బయోగ్రఫీని ఇంగ్లీషులో 'నాయన' పేరిట రాశారు. కొమర్రాజు వెంకట లక్షణరావు బయోగ్రఫీని కూడా ఇంగ్లీషులో రాశారు. ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్,జోసెఫ్ పులిట్జర్, మెడోస్ టేలర్ బయోగ్రఫీలను తెలుగులోకి అనువదించారు. టపా కథలు, వాగ్గేయకారులు, గాంధీ తత్త్వం, మాదన్న మహామంత్రి, హిస్టరీ ఆఫ్ తెలుగూస్ అండ్ దైర్ కల్చర్ మొదలయినవి ఆయన రచనలు. 1997 లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నించి గౌరవ డాక్టరేట్ కూడా అందుకున్న ఆయన రెండేళ్ళ క్రితం తనువు చాలించారు.

ఈ 'అప్పుడు-ఇప్పుడు'లో డెబ్బయి ఎనిమిది శీర్షికలున్నాయి.వాటిల్లో రాజకీయాలు, సాహిత్యం, సంగీతం, అర్వాచీన, ప్రాచీన విశ్వాసాలు అన్నీ ఆయన విలక్షణ దృష్టితో విశ్లేషించారు. వీటిల్లో ఆయన నిరాడంబర జీవనం, విలువల పట్ల అచంచలమయిన గాఢాభిమానం, మహాపురుషుల పట్ల నమ్రత మనల్ని నిరుత్తరుల్ని చేస్తాయి.

ఈ పుస్తకంలో మొదటి శీర్షిక ' 'తెలుగు' ప్రపంచం'. ఇవన్నీ రెండు పేజీలకు మించవు. అన్నీ అలవోకగా సాగిపోతాయి. ఆసక్తికరంగా వుంటాయి. వీటిని వ్యాసాలని అనలేం. స్కెచ్‌లు అనడానికీ వీలు పడదు. ఒక

విషయాన్ని వుద్దేశించి మొదలవుతాయి కానీ లెక్కలేనన్ని వచ్చి చేరుతాయి.తెలుగుకు సంబంధించి దాదాపు పది వ్యాసాలలో విశ్లేషించారు. మొదటి టాపిక్ 'తెలుగు ప్రపంచం' అన్నాం కదా! అది ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో రాసింది. తెలుగు మహాసభల హడావుడి గురించి వివరిస్తూ ,

"ఆంధ్రులు భలేవాళ్ళు. ప్రపంచ తెలుగు మహాసభలలో ఉపన్యాసాలు, నాట్యాలు, నాటకాలు వగైరాలు ప్రదర్శించారు. ఆ పైన అంతర్జాతీయ తెలుగు సంస్థ అని ఒక కార్యాలయాన్ని నెలకొల్పారు. కొంత కాలానికి 'అంతర్జాతీయ తెలుగు' అనేది ఒక పార్యాంశంగా తెలుగు విశ్వవిద్యాలయంలో కలిపారు. ఎవ్వడికీ జాతీయ తెలుగే రాదు, అంతర్జాతీయ తెలుగు ఎక్కడ నుంచి వస్తుంది? " అని చురక వేస్తారు. తెలుగు ప్రసక్తి వచ్చింది కాబట్టి తెలుగుకు సంబంధించిన ప్రతిదీ పరామర్శిస్తారు. ఆ పరామర్శలో విజ్ఞత వుంటుంది. వివేకం వుంటుంది.

తెలుగు మహాసభల నిర్వహణ గురించి చెబుతూ 'ఒక రహస్యం. సంస్థ అధ్యక్షుడు వందేమాతరం రామచంద్ర రావు, డైరక్టరు రామప్ప , డిప్యూటివ డైరక్టర్ శివరామమూర్తి, వీరభద్రశాస్త్రి ఈ నలుగురికీ పనిలో తప్ప వేరే యావలలో పొసగదు', అంటారు. వ్యక్తులలో ఉన్న మంచి లక్షణాల్ని ఆయన టక్కున పసిగట్టేస్తారు. ప్రపంచ తెలుగు సభల పరిశీలన వల్ల ఆయన "ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతుంటే నేను రకరకాల ఆంధ్రులను చూసాను. ఇన్ని ఏళ్ళ తర్వాత కొన్ని పేర్లు మరచిపోతున్నానేమో'. ఒక్కటి మాత్రం నిజం. కొత్త భావాలు మాత్రం ఎవ్వరూ చెప్పలేదు. పైగా తెలుగువాళ్ళ చరిత్రను శోధించిన వాళ్ళు చాలా తక్కువ. ఒక వరుస క్రమంలో తెలుగు వాళ్ళ ఇతిహాసం తెలియదు, తెలుగు భాష చరిత్ర కూడా అంతే. కాకపోతే ఇటాలియన్ అనే యూరోపియన్ భాషను తెలుగు పోలినది అని ఎవడో అన్నాడని బానిస పండితులునోరూర్చుకుంటూ ఉంటారు. తెలుగు అనే భారతీయుల భాషను పోలినది ఇటాలియన్ అని ఏ యూరోపియన్ పండితుడూ అనలేదు' అంటారు. తెలుగు పట్ల కృష్ణగారికి వున్న అపారమయిన ప్రేమను ఈ మాటలు తెలుపుతాయి.

కృష్ణగారి దృష్టి విలక్షణమైనది. తెలుగు భాష అనేది ఒకటున్నది అని ప్రపంచానికి తెలియజెప్పిన వాళ్ళు ముగ్గురంటే ముగ్గురే అంటారు. త్యాగరాజు, పుట్టపర్తి సత్యసాయిబాబా, రాజ్‌కపూర్. ఈ ముగ్గురిలో త్యాగరాజకీర్తనల సంగతి, వాటి ప్రాశస్త్యం తెలిసిందే. పుట్టపర్తి సత్యసాయిబాబా కేవలం తెలుగులోనే వుపన్యసిస్తే ఇతర్లు వాటిని అనువదిస్తారు. పుట్టపర్తి వారి అంతర్జాతీయ ప్రాశస్త్యం మనందరికీ పరిచితమే. రాజ్‌కపూర్ సినిమాలో 'రామయ్యా వస్తావయ్యా' అన్న పాట ఖండఖండాంతరాల్లో మారుమోగిన సంగతి వివరించారు,

తెలుగువాళ్ళ బానిస ప్రవృత్తిని వీలయినన్ని సార్లు విమర్శిస్తూ వుంటారు. విసుర్లు విసురుతూ వుంటారు. "ఇతరుల ఆచారాలను, బాసలను అనుకరించడం ఆంధ్రులకు సహజం అయింది. మన ప్రాంతంలో వ్యాపారం చేసుకోవడానికి వచ్చే వాళ్ళందరి భాషల నుంచీ కొన్ని ముక్కలు మన భాషలో చేర్చుకున్నాం. ప్రతి ఆంధ్రుడూ ఒక గిరీశం, లేక దాదాపు అంతటివాడూ".

'కాస్సేపు తెలుగు మాట్లాడండి' శీర్షికన విద్యారంగం నుంచీ తెలుగెట్లా క్రమక్రమంగా కనుమరుగవుతుందో కళ్ళకు కట్టినట్లు వివరించారు. ఆ మాటల వెనుక ఉన్న వేదన మనకు విషాదాన్ని మిగిలిస్తుంది.'ప్రవాసంలో ఆంధ్రప్రతిభ' వ్యాసంలో మన తెలుగు వాళ్ళు దేశదేశాల్లో వ్యాపించడాన్ని, ప్రతిభామూర్తులు మన పేరు ప్రతిష్ఠల్ని విస్తరించడాన్ని వివరించారు.

జి.వి. రమణరావు అన్న అతను అమెరికాలో 'నాసా' కేంద్రంలో పని చేస్తారు. ఆయన స్పేస్ అకూస్టక్స్‌లో నిపుణుడు. రాకెట్లు శబ్దం చేస్తాయి కదా! ఆ శబ్దాన్ని తగ్గించే ఉపాయాన్ని కనిపెట్టినవారు రావుగారు. 'అది ఒక పరికరం. రాకెట్‌లో ఒక భాగం. దాన్ని రావ్‌గారి నాజిల్ అంటారు.అతడికి ఆంధ్రప్రదేశ్‌లో ఒకప్పుడు జూనియర్ ఇంజనీరు ఉద్యోగం ఇవ్వలేదట ! ఆయన కనిపెట్టిన నాజిల్‌ని మన ప్రభుత్వం కొన్ని కోట్లు పెట్టి కొనాలి! ఎందుకంటే అతడు అమెరికా పౌరుడు!

ఇట్లాంటి కథనాలు, విశిష్ట వ్యక్తిత్వాలు కృష్ణగారు ఎన్నో వివరిస్తారు. ఈ సంగతి చెప్పి "ఇట్లా వుంటుంది ఆంధ్రప్రదేశ్ . విచిత్రం కానీ విడ్డూరం కానీ ఏమీ లేదు. మనకు పెరటి చెట్టు మందుకు పనికి రాదు అనే సామెత వుంది. మన వాడు మంచివాడవుతే వానిని వెళ్ళ గొట్టాలి. ఇది కొత్త సంప్రదాయం. ఇంతకూ మనకు కావలసినది మానవత. మానవ ప్రతిభ. అవి మన వాళ్ళకు ఉన్నయ్యి. డబ్బు అంటే ఇవి కావు" అంటారు.

విదేశాలలో స్థిరపడిన మన తెలుగువాళ్ళు తెలుగుతనాన్ని ఎట్లా నిలుపుకున్నారో ఎన్నో సందర్భాలలో వివరిస్తారు.

ఎన్నడో 1980 ప్రాంతంలో మిత్రుడు వేణుమాధవ్, కెప్టెన్ సత్యనారాయణ మరి ఇద్దరు మారిషస్ వెళ్ళి అక్కడి నుండి దక్షిణాఫ్రికాకు వెళ్ళి కొన్ని దినాలు అక్కడి ఆంధ్రులకు అతిథులుగా గడిపి వచ్చారు. వస్తూ ఒక జీవిత కాలానికి సరిపడా సౌహార్దం తెచ్చుకున్నారు. అక్కడి ఆడవాళ్ళు, వీళ్ళను తమ పుట్టింటి నించి వచ్చిన ఆత్మీయులుగా సంభాషించారు. వీళ్ళు స్నానం చేసి, విడిచిన గుడ్డలను వుతికి ఆరవేసి ఇచ్చారు. ప్రతి ఆంధ్రుడూ భోజనానికి ఆహ్వానించాడు. ఏ ఇంటికి వెళ్తే అక్కడ వడియాలు ఇచ్చారట! డర్బన్‌లో ఆంధ్రులు నివసించే ఇక వీధికి 'వరంగల్ రోడ్డు' అని పేరు పెట్టుకున్నారట!

ఇట్లాంటి వింతలు విశేషాలు ఈ గ్రంథంలో అడుగడుగునా కనిపిస్తాయి.

మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి, పి.సాంబమూర్తి, సుబ్బరామ దీక్షితులు, బి.ఎన్.శాస్త్రి, నటరాజ రామకృష్ణ మొదలయిన వాళ్ళు తెలుగుచరిత్ర,కళల పట్ల చేసిన కృషిని బహుముఖాలుగా వివరించారు.

బసవరాజు అప్పారావు గారి ముఖతా కాళ్ళకూరి నారాయణరావుగారి చరిత్ర, నాటకాల వివరణ విశ్లేషణ ఆసక్తిదాయకంగా వివరించారు. తెలుగులో పాండిత్యం సంపాదించిన వాళ్ళ ఛాందసం గురించి ఒక వ్యాసంలో వివరించారు.

అతను పత్రికా రచయిత కావచ్చు, రచయిత, రాజకీయ వేత్త కావచ్చు, కళాకారుడు కావచ్చు. ఎవరిగురించి వ్రాసినా కృష్ణగారు అతని మూర్తిమత్వాన్ని రూపు కట్టిస్తారు. ఆ వ్యక్తిని మనం జీవితాంతం మరచిపోలేం.

స్వాతంత్ర్యం అన్నమాటను అందరం వింటూ వుంటాం. అంటూ వుంటాం. స్వాతంత్ర్యం అన్న మాటకు అర్థం తెలిసిన వాళ్ళు స్వాతంత్ర్యాన్ని అనుభూతి చెంది జీవించే వాళ్ళు కొందరే. అటువంటి స్వాతంత్ర్యం జీవితంగా జీవించిన వారు కృష్ణగారు.

స్వతంత్రం గురించి ఆయన అభిప్రాయాలు చూడండి.

స్వతంత్రం వలన అప్పడప్పుడూ భోజనానికి ఇబ్బంది కలగవచ్చు కానీ వాస్తవానికి స్వాతంత్ర్యం మనిషి జీవితంలో గొప్పది. ఉద్యోగం చేయడం అంటే స్వాతంత్ర్యాన్ని అమ్ముకొనడమే కదా! పత్రికలలో 'ఉద్యోగాలున్నాయి' అనే వ్యాపార ప్రకటనలు చూసినప్పడల్లా 'స్వాతంత్ర్యాన్ని కొంటాము' అనే అర్థం

స్ఫురిస్తుంది. అయితే మన దేశంలో స్వాతంత్ర్యాన్ని ఎంతకు అమ్మాలో ఎంతకు కొనాలో తెలిసిన వారు తక్కువ. నా అనుభవం ఏమంటే నా స్వాతంత్ర్యాన్ని తక్కువ ధరకు అమ్ముకున్నాను. ఇతరుల స్వాతంత్ర్యం ఎక్కువ ధరకు అమ్మించి పెట్టాను...."

"నన్ను చిన్నప్పుడు పెంచినామె పేరు 'అనసూయ!' అందువలన బతికిపోతున్నాను. అసూయ మాత్రం లేదు. నన్ను చూసి అసూయ పడవలసిన గతి ఎవ్వరికీ పట్టదు!" జీవితం పట్ల ఆయన సంతృప్తి ఎంతటి కోటీశ్వరుడి కయినా ఈర్ష్య కలిగిస్తుంది.

మనిషిలోని అణువంత సహృదయత, ఔదార్యం, ఒక చిరునవ్వు కనిపిస్తే కరిగిపోయే వెన్నలాంటి హృదయం కృష్ణగారిది. కాఠిన్యం పట్ల ఎంత కఠినంగా వుంటారో కరుణ పట్ల అంత ఆర్ద్రంగా మారుతారు.

కృష్ణగారికీ ఏ విషయమూ పరిహార్యం కాదు. ప్రపంచం ఆయన విహార స్థలం. గొప్ప తాత్విక చర్చలూ అలవోకగా చెయ్యగలరు. తపస్సు చెయ్యడానికి అడవులకు వెళ్ళడం అన్నది మనకు సినిమాలు, నాటకాలు, కావ్యాలు నేర్పిన విషయమని ఆయన ఆరోపణ.

శ్రీకృష్ణ కర్ణామృతం 'కావ్యంలో కవి 'చింతామణిర్జయతు' అని ప్రారంభించాడు. చింతామణి అతని వుంపుడు గత్తె అని ఆమె కవికి ఆధ్యాత్మిక ప్రబోధం చేసిందని పండితులు అర్థం చెప్పారు. ఆ విషయం గురించి వివరిస్తూ కృష్ణగారు 'వినీల ఆకాశాన్ని ధ్యేయ పదార్థంగా పెట్టుకుని, జపం చేయటం చింతామణీ విద్య అని యోగసాధనలో చెప్పిన పద్ధతి. నీలపు చుక్కపైన దృష్టిని కేంద్రీకరించి జపించిన యోగులున్నారు కదా! దాన్ని వదిలేసి నోరూరే కథలు చెప్పారు' అంటారు.

ఆ సందర్భంలో నాటి రంగస్థల నటుల గురించి వివరిస్తూ మాధవ పెద్ది వెంకట్రామయ్య పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న విషయం చెప్పారు. ఆయన మాధవపెద్ది వెంకట్రామయ్యేనా? కాదా? అని మొదట ఒక స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ వచ్చి ఖరారు చేసుకుపోయాడట. తరువాత ఒక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చి ఆయన వయసు నిర్ధారించుకుని వెళ్ళాడట. ఇవన్నీ కరెక్టే అని ఒక పై అధికారి వచ్చి పోయాడట. ఇవన్నీ అయ్యేసరికి ఏడాది గడిచిందట. ఈ సందర్భంలో కృష్ణగారు తరువాత ఇలా కొనసాగించారు.

"ఒకనాడు పులిపాటి ఆవరణలో విచారగ్రస్తుడై కూర్చుని వున్నాడు. ఒక స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ వెంకట రామయ్య గారి ఇల్లెక్కడ?" అని అడిగాడు. దేనికి? పింఛను దరఖాస్తుపైన ఇంకా విచారణే! ఆ! సరైన సమయానికి వచ్చారు. వాడు ప్రశాంతంగా వున్నాడు. అదే ఇల్లు. వెళ్ళి చూసి రండి' అని పులిపాటి అతడిని ప్రోత్సహించి పంపించాడు.

మరేం లేదు. మాధవపెద్దిని బయట పడుకోబెట్టి చుట్టూ బంధువులు కూర్చుని ఉన్నారు!

ప్రభుత్వానికి నెలకు వంద ఆదాయం" అని మనవాళ్ళ 'తీరు' గురించి హృదయవిదారకంగా వర్ణిస్తారు. ప్రతిభావంతుల జీవితాలు ఎంత దుఃఖాంతాలుగా ముగుస్తాయో చూపిస్తారు. మన మనసు విషాదంతో కలత పడుతుంది.

'ఎందరో మహానుభావులు' అన్న వ్యాసంలో త్యాగరాజు గురించి ఆసక్తికరమైన కథనముంది. గోవింద మరార్ అన్న అతను త్యాగరాజు దగ్గరికి వచ్చి పాడమన్నాడు. త్యాగరాజు తను పాడకుండా అతన్నే పాడ మన్నాడు.గోవిందమరార్ మోహనరాగంలో ఆలపించాడు. తెల్లవారే వరకు ఆలపిస్తూనే వున్నారు. త్యాగరాజు శిష్యబృందం నిద్రకూడా మరచి విన్నారు. అప్పుడు త్యాగరాజు 'ఎందరో మహానుభావులు' అన్న కీర్తన పాడారట.

పాడి గోవిందమరారను ఆ పేరుతో పిలవకూడదని 'గోవిందస్వామి' అని పిలవాలని అన్నారట. ఎందుకంటే 'మరార్' అన్నది నేరజాతికి ,చెందిన కులసంకేతమట. ఈ సందర్భంలో స్టూవర్ట్‌పురం మొదలయిన వాటి పూర్వరంగాన్ని విశ్లేషించారు.

కోటంరాజు పున్నయ్య ప్రముఖ సంపాదకులు. ఆయన గురించి రాస్తూ ఆయన సింధ్ అబ్జర్వర్ పత్రిక స్థాపక సంపాదకత్వం గురించి, ఆయన ఆధునిక కరాచీ నిర్మాణానికి చేసిన కృషి గురించి వివరించారు. పాకిస్థాన్ ఏర్పడ్డాక ఇండియా వచ్చేశారు. ఆంధ్రపత్రిక ఆఫీసులో కృష్ణగారు పున్నయ్య గారితో కబుర్లు చెబుతున్నారు. "ఇంతలో ఒక వృద్ధుడు, ఒక తోపుడు బండిలో మిఠాయి అమ్ముకుంటూ రోడ్డు మీద పోవడం కిటికీలోంచి కనిపించింది. పున్నయ్యగారు గబాగబా కిందు వెళ్ళి ఆ వృద్ధుడికి పాదాభివందనం చేశాడు. ఆ వృద్ధుడూ, పున్నయ్యగారూ కౌగలించుకుని ఏడ్వసాగారు... సంగతేమిటంటే ఆ వృద్ధుడు సింధ్ అబ్జర్వర్ పత్రిక నిర్వాహక మండలి ప్రముఖుడు! అతడి ఆస్తిని పాకిస్తానీలు దోచుకోగా అతడు తన వారిని చేరదీసుకుని కట్టుబట్టలతో భారతదేశానికి వచ్చేశాడట!"

కృష్ణగారి అనుభవాల్లో ఇట్లాంటి అర్థమయిన సంఘటనలు ఎన్నెన్నో. వాటిని ఆయన పదిలంగా హృదయంలో దాచుకుని సందర్భానుగుణం చెబుతూ వుంటారు.

రాజకీయ వాదులు దేశాన్ని బాగు చేస్తామని చెబితే వెనకటి రోజుల్లో నిజమేనేమో అని జనం అనుకునేవాళ్ళు. ఈ రోజు ఆ మాటల్ని ఎవరూ నమ్మడం లేదు. వాళ్ళు నమ్మకపోయినంత మాత్రాన రాజకీయవాదులకు వచ్చిన నష్టమూ లేదు. అనివార్యమయిన ఈ వంచనకు జనం అలవాటుపడిపోయారు. ప్రత్యామ్నాయం అన్నదిఎప్పుడూ మరో గుది బండగానే తయారవుతోంది. ఈ విషవలయాన్ని కృష్ణగారు ఇలా అంటారు.

'మనదేశంలో నెలకొల్పిన ప్రతి ప్రాజెక్టు ఎన్నికల పార్టీలను నిర్వహిస్తున్నది. రాజకీయవాదులకు సరిగా కమీషన్లు కలసి రాకపోతే ఆ ఫ్యాక్టరీ 'సిక్' అవుతుంది. ఆ ప్రాజెక్టుకు ఖర్చు అంచనాలను సవరిస్తారు. మురుగు కాలువ మరమ్మత్తులో వాటాలుంటాయి. చీపుళ్ళ కొనుగోలులో వాటాలుంటాయి. ఒకరికిచ్చిన ఉద్యోగాన్ని ఇంకొకళ్ళు చేయటానికి అనుమతించటంలో వాటాలుంటాయి. అసలు ప్రతి రాజకీయ పార్టీ ఒక రియల్ ఎస్టేట్ పార్టీ'. ఆశకు ఆస్కారమివ్వని దౌర్జన్య వలయంలో మనమెలా చిక్కుకున్నామో ఇలా వివరిస్తారు.

గొప్ప సాహిత్యకారులకు వయసుతో పనివుండదు. కొందరు జీవితాంతం రచనలు చేస్తారు. జర్మన్ కవి గెథే డెబ్బయ్యేళ్ళు దాటాకా పర్షియన్ భాషను నేర్చుకోవడానికి ప్రయత్నించాడు. రవీంద్రనాథటాగూర్ వృద్ధాప్యంలో అద్భుతమయిన కళాఖండాలని వేసి చిత్రకారుడయ్యాడు. మైకెలాంజిలో డెబ్బయ్యేళ్ళప్పుడు అద్భుతమైన కవిత్వం రాశారు. కళాకారులు, కవులు వైవిధ్యం కోసం అల్లాడతారు.

విశ్వనాథ సత్యనారాయణగారి గురించి మనకు తెలియని సంగతులెన్నో కృష్ణగారు వివరించారు. డెబ్బయ్యేళ్ళు దాటిన తర్వాత విశ్వనాథ వారు సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టారట. ధర్మపురి రామ్మూర్తి రోజూ వెళ్ళి పాఠం చెప్పేవాడట. అలా విశ్వనాథవారు నాలుగేళ్ళ పాటు సంగీతం అభ్యసించారట. కృష్ణగారు విశ్వనాథవారి సంగీత పాండిత్యం గురించి "ఒకనాడు నాకు కూడా సత్యనారాయణ తన సంగీత నైపుణిని చూపెట్టాడు. ఇక కావ్యగానం మానేసి, స్వయం కృతులో, కీర్తనలో వ్రాసి వాటిని గానం చేస్తూ ఉంటాడను కున్నాను. దేనికదేనన్నాడు."

ఆయన సంప్రదాయాభిమాని. కానీ ఆయన వ్యావహారిక జీవన విధానంలో దానికి పూర్తి భిన్నంగా ప్రవర్తించేవాడట." మరొక విశేషం. ఆయన ఎంతగా మన బూజు పట్టిన రాచ మర్యాదలకు కట్టుబడిన వాడైనా వ్యావహారిక జీవనంలో సంప్రదాయ భగ్నం యధేచ్ఛగా చేసి నెగ్గుకు వచ్చేవాడు. ఆయన స్నేహితులలో అన్ని కులాల వాళ్ళూ, అని శాఖల వాళ్ళూ ఉన్నారు. నిజంగా అట్లాంటి స్నేహితులు దొరకటం అదృష్టం. వారిలో కొందరిని ఎరుగుదును. ఇట్లాగే ఆయనకు ఇష్టం లేని మనుషులలో ఆయన 'కులశాఖ వాళ్ళూ ఉన్నారు' అంటారు కృష్ణగారు.

కృష్ణగారు పాత్రికేయులు. ఏ ప్రాంతాన్ని దర్శించినా, ఏ వ్యక్తిని కలిసినా ఏదో మొక్కుబడిగా రాయరు. ఆ ప్రాంతాన్ని ఆవిష్కరిస్తారు. ఆ వ్యక్తి అంతస్సారాన్ని మనకు అందిస్తారు. 1950 లో కళా వెంకట్రావుగారితో బాటు కారులో కృష్ణగారు వెళుతున్నారు. కైకలూరు దాటాం. ఒక కాలువ నీటిని ఒక మగాడూ, ఒక ఆడదీ ఒక తిరుగుడు యంత్రంతో తోడుతున్నారు. కారును ఆపించాను.వెంక్రటావుగారు సరదామనిషి. నీళ్ళు తోడేవాళ్ళు పాడే పాట వినటానికి నేను కారును ఆపించానని ఆయన తెలుసుకోగలిగాడు. సాధారణంగా మంత్రులు అట్లా కారు ఆపనీయరు. కానీ ఆ మనిషి వేరు

"ఎలికల్ల వాళ్ళ సిన్నాదిరో
ఉండాదిరో - అది
ఏడూ వాడల పైన...!!
జొన్న పంట దాక ఉండాదిరో
అది జొన్న కంకి గుంజి
తిన్నాదిరో - అది"

కొన్ని బూతులతో ఆ పాట రసవత్తరం. ఎలికల వాళ్ళ బదులు ఎరికల వాళ్ళు అంటే సరి. 'మేవెరికవారు' అంటే జ్ఞానులు కదా! ఆదిభట్ల నారాయణదాసు గారి వ్రాతలు చదివితే తెలుస్తుంది" అంటూ వ్యక్తుల్ని, దృశ్యాల్ని కళ్ళకు కట్టిస్తారు కృష్ణగారు.

ఈ క్రమంలో ఆయన మానవ మనస్తత్వ పరిశీలన, అధ్యయనం, తాత్విక స్పర్శవున్న ఆయన మాటలు మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి.

కృష్ణగారికి మన ప్రాచీన కళల పట్ల అభిమానం. అవి మన సంస్కృతిని ఆవిష్కరిస్తాయని ఆయన విశ్వాసం. అట్లా అని ప్రాచీనమయిన ప్రతిదానినీ నిర్విచక్షణగా అభిమానించడం ఆయన ప్రవృత్తికే విరుద్ధం.

'జగదాంబ అభినయం' అన్న వ్యాసం భారతీయ నాగరికతలో దాదాపు రెండువేల ఏళ్ళలో ఈ మధ్య వచ్చి పడిన గొప్ప మార్పు ఏమంటే 'ప్రతిభకు ప్రత్యేకత ఏమీ లేకుండా చేయటం'. అధికార రోగపూరిత బధిరాంధకులను ప్రతిభకు రాజపోషకులను చేయటం ' అంటూ మొదలవుతుంది. 1972-73 ప్రాంతాల్లో క్షేత్రయ్య జయంతి సందర్భంలో మొవ్వలో వున్నరట కృష్ణగారు. శ్రీమతి దుగ్గిరాల జగదాంబ అనే డెబ్బది ఐదు సంవత్సరాల విదుషీమణి అక్కడ వుందట'. ఆమె భర్త పదవీ విరమణ చేసిన డిప్యూటీ కలెక్టరట! నటరాజ రామకృష్ణ ఆమెను ఆమె భర్తను బతిమలాడి ఆమెను అభినయం చేయించడానికి ఒప్పించాడట.

"జగదాంబ వేదిక నెక్కింది. నటరాజ రామకృష్ణ ప్రారంభించాడు. ముందటివలె నాపై నెనరున్నదా స్వామి! అని మెల్లగా భైరవిరాగంలో ఆ కళ్లలో ఆ పదమే కాన వచ్చింది. చౌకంలో ఆ కళ్ళలో ఆ పదమే కాన వచ్చింది. ఆ పైన "ముచ్చటలిక నేలరా! ఎందుకు మొగమిచ్చక వేపు మాటలడేవేరా... మువ్వ గోపాల నా స్వామి!"

ఇలా చెప్పకుంటూ కృష్ణగారు జగదాంబగారి అభినయాన్ని భావస్ఫోరకంగా మనకు వివరిస్తారు. పరవసిస్తారు. సందర్భం వచ్చినప్పుడు దానికి సంబంధించిన ఇతర విషయాలను చెప్పడం కృష్ణగారికి అలవాటు. మువ్వ గోపాల పదంలో 'నెనరు' అన్న పదం విని " ఈ శబ్దం.. నెనరు - ఎంతగా భావస్ఫోరకమైనదో! త్యాగయ్య తాను రామునిపై 'నెనరుంచినాను' అన్నాడు. అంటే ప్రేమ, గౌరవము, అభిమానము, ఆప్యాయతా, ఇప్పటికీ ఈ శబ్దాన్ని నల్గొండ జిల్లాలో పలువురు ధారళంగా వాడుతూ ఉంటారు 'నెనరుగల బిడ్డ! పెళ్ళి ఆడవచ్చు!"

ఇప్పడు కనిపించదు కానీ వెనుకటి రోజుల్లో 'గురుభక్తి' అంటూ వుండేది. దానికి ఆయన ఇచ్చిన వుదాహరణలు హృద్యంగా వుంటాయి.

కుర్తాళం పీఠాధిపతిగా విమలానంద గారు పనిచేశారు.పూర్వాశ్రమంలో ఆయన పేరు రామారావు. ఆయన గురువులు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు. రామారావుగారు సన్యసించకముందు సంగతి అది. సన్యసించాకా విమలానందగారు ఓ సారి విజయవాడలో వుపన్యసించి పాటిబండ అప్పారావు గారింట్లో మకాం చేశారట. అక్కడికి అనుకోకుండా చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రిగారు వచ్చారట. ఆయన్ని చూస్తూనే విమలానందలేచి నిలబడ్డాడట! కాని శాస్త్రి గారు ఆయన్ని 'కూర్చోండి అని చెప్పి ప్రదక్షిణం చేసి పాదాభివందనం చేశాడట! విమలానంద తన గురువుగారు పాదాభివందనం చేసినందుకు ఏడవడం మొదలుపెట్టాడట!

"ఒకప్పడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు తన శిష్యుడైన వేమూరి రామకృష్ణా రావుకు సన్మానం చేశాడు! గురువు తనకు ఇంత సేవ చేస్తున్నందుకు రామకృష్ణారావు కన్నీరు పెట్టుకున్నాడు. వాళ్ళ మర్యాదలు నేటికీ భిన్నం!" అంటారు కృష్ణగారు. అట్లాంటి విమలానంద విశ్వనాథ సత్యనారాయణగారికి ఆధ్యాత్మిక గురువు. తన 'రామాయణ కల్పవృక్షం' ఎవరు మెచ్చినా మెచ్చుకున్నా తన ఇలవేల్పయిన విశ్వేశ్వరుడు, తన గురువయిన విమలానందుడు మెచ్చితే చాలుఫో!" అని చెప్పకున్నాడు విశ్వనాథ!

ఈ సందర్భంగా ఆసక్తికరంగా కృష్ణగారు విశ్వనాథకు జ్ఞానపీఠ అవార్డు వచ్చిన సందర్భంలో ఒక ఘటనని వివరించారు.

ఒక రోజు 'రామాయణ కవి' విశ్వనాథకు నందమూరిలో గొప్పగా సత్కారం చేశారు. ఒక చిన్న లారీ మొత్తం బహుకృతులు! విశ్వనాథ కారులో బెజవాడ వస్తున్నాడు. రామవరప్పాడు వద్ద ఒక తోటలో శ్రావ్యమైన భజన గానం వినవచ్చి, కారు ఆపి ఒక శాలువ, ఒక నూట పదహార్లు రెండు పళ్ళు పట్టుకుని లోనికి వెళ్ళి అక్కడ మందిరం వద్ద భజన నడుపుతున్న ఒక కుర్రవాణ్ణి చూశాడు. వాని చేతిలో శాలువా, నూట పదహార్లు పెట్టాడు! ఆ కుర్రాడు ఒక దణ్ణం పెట్టి 'సత్యనారాయణగారూ' రాముని తల్చు కొనడానికి నూట పదహార్లు, శాలువా ఎందుకండీ!' అని పళ్ళు తీసుకుని మిగతావి తిరిగి ఇచ్చేశాడట!

ఈ సందర్భాన్ని గురించి చెబుతూ కృష్ణగారు

"సత్యనారాయణకు ఏడుపు వచ్చింది!తాను రాముని తల్చుకున్నందుకే గదా పెద్ద సన్మానం పొందాడు! దానికి ఈ కుర్రవాడు ఇంతగా ఆక్షేపించాడేమిటి? తనలో ఏమి లోపం వచ్చింది? వారం రోజులు తల్చుకు తల్చుకు

ఏడ్చానని ఆయనే నాకు చెప్పాడు! నేను ఆయన ఏడుపు మూడో రోజున వెళ్ళి పలకరించాను. బాగా మాట్లాడలేకపోయా డు!" ఇట్లా వివరించి విశ్వనాథ ఆంతర్యాన్ని ఇలా మనముందుచుతాడు "అదీ విశ్వనాథలో గొప్పతనం. తన తప్పును గ్రహించుకుని దిద్దుకోగలడు. దిద్దుకునే వీలు లేకపోతే కన్నీటితో కడుక్కోగలడు!" అంటాడు.

ఇప్పటి రాజకీయ నాయకులు ఎంత అవిద్యావంతులయితే అంతగా రాణిస్తున్నారు. సభ్యత, సంస్కారం ఇవేవీ లేని దౌర్జన్యవంతులే నాయకులై దేశాన్ని దోచుకుంటున్నారు. వెనకటి రోజుల్లో అలాంటివారులేరా? అంటే లేరని కాదు. కొందరయినా విద్యావంతులు, సంస్కారవంతులు పార్లమెంటులో, శాసన సభలో వుండేవారు ఒకసారి పార్లమెంటులో జరిగిన చర్చలో విద్వత్తు ఎట్లా ప్రదర్శింపబడిందో వివరించారు.

అప్పట్లో అమెరికాతో తగినంత స్నేహం చెయ్యడం లేదన్న విమర్శవచ్చిందట. అట్లాంటి సందర్భంలో భంజ్‌దేవ్ లనే ఒక ఒరిస్సా సభ్యుడు (అతను ఒక సంస్థానాధిపతి కూడా) ఆర్థిక మంత్రి వైఖరిని విమర్శిస్తూ " ఋణకర్తా పితాశః అన్నాడు (అప్పులు చేస్తున్నాడనే కోపంతో అప్పులు చేసే తండ్రి శత్రువు సుమా ' అని హెచ్చరించాడు) చింతామణి దేశ్‌ముఖ్ అన్న అప్పటి ఆర్థిక మంత్రి "మిత్రం మంత్రివరఃపరమ్" (ఋణాలు చేసే మంత్రి మిత్రుడు' అని భావం) ఇంతలో రామ రాజ్యపరిషత్తు సభ్యుడు రాంవిలాస్ శర్మ జోక్యం చేసుకుని 'ఋణాన్‌పుత్రాన్ వినశ్యంతి' అని హెచ్చరించాడు (అంటే తండ్రి అప్పులు చేస్తే సంతానం నశిస్తుంది అని అర్థం) ఆర్థికమంత్రి తడుముకోకుండా 'రాష్ట్రం వృద్ధించ గచ్ఛతి' అన్నాడట. (అంటే దేశం అభివృద్ధి చెందుతుంది' అని అర్థం)

ఆ చింతామణి దేశ్ ముఖ్ దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ భర్త!

ఇట్లాంటి ఎన్నో ఆసక్తికర సంఘటనల్ని అపురూపంగా వివరిస్తారు కృష్ణగారు. పాత పుస్తకాలంటే కృష్ణగారికి ప్రాణం. పాతపుస్తకాల షాపుల్లో ఎన్నో అపురూప గ్రంథాలు దొరుకుతూ వుంటాయి. వాటి అన్వేషణలో ఆయన అనుభవాల్ని 'గతం నించి ప్రవవహించే నది' అన్న వ్యాసంలో వివరించారు. మద్రాస్ మూర్ మార్కెట్, విజయ వాడ అలంకార్ దగ్గర వున్న పాత పుస్తకాల దుకాణం, హైదరాబాద్ అబిడ్స్ ఆదివారం పాతపుస్తకాల విశేషాలు వివరించారు.

'పాత పుస్తకాల దుకాణం అంటే అమ్మల గన్నయమ్మ. ఎవరికి ఎప్పుడు వికాసం కలిగించినదో! పాత పుస్తకాల దుకాణం ఒక సంస్కృతి ప్రవాహం. గతం నించీ ప్రవహించేది' అంటారు కృష్ణగారు పరవశంగా.

మనం కొన్నిటికి అలవాటు పడిపోయి వుంటాం. అన్ని రంగాల్లోనూ కొందర్ని గొప్పవాళ్ళను చేసి కూర్చుంటాం. వెనుకటి వాళ్ళు అట్లా చెప్పారు కాబట్టి ఆలోచన లేకుండా వాటికి ఆమోద ముద్ర వేస్తాం. కృష్ణగారు స్వతంత్ర చింతనా పరుడు. స్వతంత్ర ఆలోచనలతో ఆయన చేసే నిర్ణయాలు మన తల బొప్పి కట్టిస్తాయి.

గురజాడను అందరూ గొప్పగా కీర్తించడం సాహిత్యకారులందరికీ తెలిసిన సంగతే. గురజాడ ఏమిటి? నన్నయ, తిక్కన వగైరాలను తలకెత్తుకుంటాం. ఈ సందర్భంలో కృష్ణగారి మాటలు చూడండి.

'నన్నయ కాలం నించీ మన కవులు, రచయితలు చాలా వరకూ బానిసలే...ఒక వైపున బ్రిటిష్ ప్రభుత్వం, భారతీయ దేశభక్తులను చంపి కొట్టి బాధిస్తూ ఉండగా గురజాడ అప్పారావు ఏమని వ్రాసినాడో చూడండి.

"వచ్చెనిది బంగారు కాలము
వాంఛలెల్లను తీరు సుజనులకు
ఆంగిలేయుల ధర్మ రాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్య మిచ్చును
సంతతము వర్ధిల్లు గావుత ! "- అని తన బానిస అనుయాయులకు, అభిమానులకు ప్రబోధించాడు...

మన కవులలో దేశభక్తులు తక్కువ. ఇప్పుడు పాతవారినందరినీ దేశభక్తులుగా మార్చే ప్రయత్నం, కులతత్వం వలన, సానుకూలంగా జరుగుతున్నది లేక అధికార ఆశయం వలన బాగా సాగుతున్నది' అంటారు.

తన వృత్తినే దైవంగా నమ్ముకుని జీవించిన ధన్యజీవి జి.కృష్ణ. కొమరగిరి సుందరరామారావుగారు ఒక సందర్భంలో చెప్పిన మాటల్ని వివరిస్తూ ఆయన చెప్పినొక ఉర్దూ కవితను కృష్ణగారు ఉదహరించారు.

'రస్తా బతాతే హువే
రహబర్ హజార్ గుజరే
లేకిన్ కిసీకూ ఉస్‌రస్తే పే
చల్తే నహీ దేఖా'

అంటే మార్గ దర్శకులు అనేక మంది వెళ్ళిపోయారు కానీ ఆ మార్గం పైన వెళ్ళే వాళ్ళను నేను చూడలేదు' అని అర్థం.

మార్గాలు ఒకరు చూపించేవి కావు. చూపిస్తే అది మార్గం కాదు. మనిషి ఎవడికి వాడుగా స్వతంత్రంగా జీవించాలి. అది కృష్ణగారి ఉద్దేశం.

కృష్ణగారి మాటల్లో

"చదువుకునే వాళ్ళను, చదువు చెప్పే వాళ్ళను, మధ్యలో విని శ్రుత పాండిత్యం అలవర్చుకునే పత్రికా రచయితలను, జీవితాంతం చదువుకునే వాళ్ళను, సౌహార్దం గల వాళ్ళను జీవిత మధువును ఆస్వాదించిన వాళ్ళను ఎరుగుదును. వారిదొక మార్గ దర్శకత్వం... మార్గం పైన వెళ్ళే వాళ్ళూ ఉంటారంటారా ?"

కృష్ణగారి మార్గం అద్వితీయం !

back to book of the week home page

ఈ విశేష సమీక్షా వ్యాసం తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా వదాన్య సౌజన్యంతో అందించబడింది.